
# చావునడిపే జీవితం



**కు**రుస్తున్న వర్షం జానకమ్మ యేడుపులా వున్నది. సాయంత్రం నించే మొదలయింది వర్షం. కొంచెంసేపు కురిసి తగ్గిపోతుందేమో అనుకున్నది జానకమ్మ. కాని తగ్గలేదు. ఇంకా-ఇంకా పెరిగిపోయింది.

జానకమ్మ గుండెలో బతుకు గురించిన భారం కూడా ఆరోజు సాయంత్రం నించే క్రమంగా పెరిగిపోయింది.

బయట వర్షం ఉధృతంగా ఉంది. గాలి విసురుగా వీస్తోంది. ఎవరో బలవంతంగా పట్టి వూపుతున్నట్టు దొడ్లో వున్న చెట్లు అటూ ఇటూ వూగిపోతున్నాయి.

విసురుగా కొడుతున్న జల్లుకు కిటికీ తలుపులు చప్పుడు చేస్తున్నాయి.

ఇవన్నీ పట్టనట్టు బామ్మ డొక్కలో దూరి హాయిగా నిద్రపోతున్నాడు జానకమ్మ మనవడు బాబు.

జానకమ్మకు దుఃఖం పొర్లుకువస్తోంది. ఎంత ఆపుకుందామన్నా ఏడుపు ఆగటంలేదు.

గదంతా చీకటి,

కరెంటు ఎప్పుడో పోయింది. లేచి దీపం వెలిగించాలనుకున్నది. దీపం బుడ్డి మధ్యగదిలో వున్నది. ఆ గదిలోనే ఆమె కొడుకు సదానందం, కోడలు సరోజిని పడుకున్నారు. ఇంతకు ముందు ఎప్పుడయినా అయితే ఆమె ఆ గది తలుపులు తట్టే సాహసం చేసేది. కానీ సాయంత్రం సదానందం ఇంటికి వచ్చేముందు కోడలికీ, తనకీ మాటలతో యుద్ధం జరిగిన తరువాత ఆమె ఆ సాహసం చెయ్యదలుచుకోలేదు.

జానకమ్మ కన్నీళ్లు తుడుచుకున్నది.

బయట మెరిసిన మెరుపు కాంతి కిటికీ సందుల్లోంచి లోపలకు వచ్చింది.

ఆమెకు చీకట్లోనే బావున్నట్టు అనిపించింది.

కాని– మనవడు రాత్రివేళ నిద్రలేస్తే చీకటికి భయపడతాడేమోననే ఆలోచన ఆమెకు కలిగింది. వాడిమీద చెయ్యివేసి గట్టిగా తన గుండెకేసి అదుముకున్నది.

బాబుకు తనంటే ఎంతో ఇష్టం. వాడు రాత్రిళ్లు తనదగ్గిరే పడుకుంటాడు.

ఎక్కడో పిడుగు పడింది.

ఉలిక్కిపడ్డాడు మనవడు. వాడిని మరింత గట్టిగా తనకేసి అదుముకుని వాడి వీపుమీద చేత్తో భయంలేదన్నట్టు తట్టింది జానకమ్మ.

ఇంటిమీద నించి వర్షంనీళ్లు కిందికి జారుతున్న చప్పుడవుతోంది.

జానకమ్మ రేపు గురించి ఆలోచించడం లేదు. ఆమె ఆలోచనలన్నీ గతించిన గతం గురించే వున్నాయి.

ఆమె రేపటి సూర్యోదయాన్ని చూడగలదా?

తను ఈ రాత్రికే చనిపోవాలి. ఏమయినా సరే. తన చావు వాయిదా పడకూడదు. గట్టిగా నిర్ణయించుకున్నది.

ఇక తను ఎవరికోసం బతకాలి? జీవితంమీద ఏ మమకారంతో బతకాలి?

జానకమ్మ బలవంతాన తన జీవితాన్ని అంతం చేసుకోవాలని అనుకోవడం ఇది మొదటిసారి కాదు.

తను మొదటిసారిగా చచ్చిపోవాలని ఎప్పుడు అనుకున్నది?

అవును. తనకు బాగా జ్ఞాపకం. తను జానకమ్మగా మారిపోకముందు తన చిన్నతనంలో ఏడో ఏటనే తన తల్లి చనిపోయినప్పుడే తను కూడా ఈలోకం నుంచి తప్పుకోవాలని అనుకున్నది.

జానక్కి పదోయేట తల్లి చనిపోయింది. అప్పుడు జానక్కి ఎనిమిదేళ్ల చెల్లెలు కూడా వున్నది.

తల్లి పోకముందు, ఇంకో రెండు గంటలలో పోతుందనగా పిల్లలను దగ్గరగా తీసుకుని "తల్లి లేకుండా ఎలా బతుకుతారే మీరు?" అని విలపించింది. పిల్లల పట్ల తన భర్తకు ఎంత ప్రేమ వున్నదో ఆమెకు బాగానే తెలుసు.

"నువ్వు పెద్దదానివే జానకీ... నీ చెల్లెల్ని నువ్వే పెంచుకోవాలి. దాని భారం నీదే" అని కన్ను మూసింది.

జానకి బావురుమన్నది.

అక్కని చూసి చెల్లెలు కూడా ఏడుపు మొదలుపెట్టింది. తల్లి శవాన్ని తీసుకు వెళుతున్నప్పుడు జానకి తనుకూడా చనిపోతే బావుండుననుకుంది. కానీ చెల్లెలును చూస్తూ ఆపని చెయ్యలేకపోయింది.

భార్యపోయిన రెండు నెలలకే జానకి తండ్రి ఓ ఆడదాన్ని తల్లి స్థానంలోకి తీసుకు వచ్చాడు. ఆరోజునించే జానక్కి కష్టాలు మొదలయినాయి. ఆ కొత్తగా వచ్చిన తల్లి జానక్కి నరకాన్నే చూపించింది. ఇంటి చాకిరీ అంతా జానకి చేతనే చేయించింది. భర్త ఇంటికి రాగానే జానకి తన మాట వినటంలేదని చెప్పేది. భార్య మెప్పుకోసం ఆమెకు సంతోషాన్ని కలిగించటం కోసం ఆ తండ్రి జానకిని పశువులా కొట్టేవాడు.

ఇలా ఎన్ని రోజులు??

చెల్లెల్ని కాపలించుకుని ఎన్నో రాత్రులు జానకి కుమిలి కుమిలి ఏడ్చింది. ఆ బాధలను భరించలేక ఆ నరకాన్ని అనుభవించలేక ఏరోజుకారోజు చచ్చిపోవాలనే అనుకున్నది. కానీ తనుపోయిన తర్వాత తన చెల్లెలి జీవితం మరింత దుర్భరమవుతుందని తన చావుని వాయిదా వేసుకున్నది జానకి.

కష్టాలను అనుభవిస్తున్నప్పుడే జానక్కి వయసొచ్చింది. జానకి మీద ప్రేమ లేకపోయినా తన పీడ వదిలించుకోటానికి జానకి తల్లి భర్తను తొందరచేసి జానకి పెళ్ళి చేయించింది.

మూడు ముళ్లు పడుతున్నప్పుడు జానకి ఇక తను చావు గురించి ఆలోచించవలసిన అవసరం లేదనీ ఇక తన జీవితం వెలుగుమయమనీ అనుకున్నది. సంసార జీవితం గురించి రంగు రంగుల కలలు కన్నది.

కానీ కాపురానికి వెళ్లిన రోజునే తను కన్నవన్నీ కేవలం కలలేననీ అవి నిజం కావటం జరగదనీ జానక్కి తెలిసివచ్చింది.

ఎందుకంటే ఆరాత్రే జానకి భర్త అగ్రగణ్యం ఆమెతో చెప్పిన మాటలు ఇవి:

" ఈ ఇంట్లో నువ్వో బానిసవి. నీకు ఎటువంటి స్వాతంత్రమూ లేదు. స్వేచ్ఛ గురించి ఆలోచించకూడదు. ఇంటి చాకిరీ అంతా నువ్వే చెయ్యాలి. ఎవరిమాటకూ ఎదురు చెప్ప కూడదు. నాకు కొంతమంది ఆడవాళ్లతో గట్టి సంబంధాలున్నాయి. ఆ సంబంధాల గురించి నువ్వు నన్నేమీ అడక్కూడదు. విసిగించకూడదు. అర్థమయ్యిందా?"

తల వూపుతూనే మవునంగా యేడ్చింది జానకి.

అప్పుడే ఆమె మళ్లీ తను చావు గురించి ఆలోచించవలసిన అవసరం భవిష్యత్తులో వున్నదని అనుకున్నది.

అలా జానకి చావు గురించి ఆలోచించవలసిన అవసరం చాలా తొందరలోనే వచ్చింది.

తను ఆ ఇంట్లో ఓ బానిస అని భర్త ముందుగానే చెప్పినప్పటికీ జానకి భర్త ప్రవర్తనను సహించలేకపోయింది.

కొన్ని రోజులపాటు ఆమె భర్త ఇంటికి వచ్చేవాడు కాదు. ఎవరెవరి దగ్గరో గడిపి వచ్చేవాడు. ఇలా వచ్చిన భర్తను జానకి రోజూ ఇంటికి రమ్మనీ, ఇతర స్త్రీలతో వున్న గట్టి సంబంధాలను వదులుకోమని ప్రాధేయపడి అడిగింది. ఫలితంగా ఆమె భర్త చేతిలో చావుదెబ్బలు తిన్నది. అత్తగారు కూడా కొడుకునే సమర్థించడంతో జానక్కి మతిపోయింది.

అయినా జానకి తన ప్రయత్నాలను విరమించుకోలేదు.

ఆ ప్రయత్నాల్లోనే ఆమె వొళ్లు హూనమయిపోయింది.

జీవితం మీద తీపి, ఆశ పూర్తిగా నశించిపోయాయి.

అప్పుడు జానకి మళ్లీ చచ్చిపోవటానికి నిర్ణయించుకున్నది. చావటానికి అన్ని యేర్పాట్లనూ చేసుకున్నది.

కాని– సరిగ్గా ఆరోజునే జానక్కి తనగురించి ఓ నిజం తెలిసింది. ఆమె కడుపుతో వున్నదని.

ఈ నిజం తెలిసిన తర్వాత జానకి చావాలనే ఆలోచనను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నది. తన కడుపులో పెరుగుతున్న బిడ్డకోసం అయినా తను బతకాలి. వాడికోసం తను జీవించాలి.

జానక్కి కొడుకు పుట్టాడు.

వాడిని చూసుకుని ఆమె ఎంతో మురిసిపోయింది. తను అప్పటివరకూ అనుభవించిన

బాధలన్నింటిని మరచిపోయింది. వాడిని పెంచడంలో తన కష్టాలను ఆమె లెక్కచెయ్య దల్చుకోలేదు.

కొడుకు పుట్టిన ఆరేళ్లకు గుండెపోటుతో హటాత్తుగా జానకి మొగుడు పోయాడు. ఆయనెంత నరకాన్ని చూపించినా జానకి గుండె పగిలేలా విలపించింది.

ఆ తర్వాత కొడుకును ప్రయోజకుడిని చెయ్యటానికి ఆమె ఎన్నో కష్టాలను అనుభవించింది.

భవిష్యత్తు గురించి మళ్లీ ఎన్నో రంగుల కలలు కన్నది. కొడుకు పెద్దవాడయి, వాడికి పెళ్లిచేసిన తర్వాత తను సుఖపడవచ్చుననుకున్నది. ఈ విషయంలో కూడా జానకి కలలు కేవలం కలలుగానే మిగిలిపోయాయి. నిజం కాలేదు.

జానకి జానకమ్మగా మారిపోయింది.

అంతకు మించి ఆమె జీవితంలో ఎలాంటి మార్పూ లేదు.

కొడుకు ప్రయోజకుడయ్యాడు. ఉద్యోగం వచ్చింది. తనకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు.

కోడలు వచ్చింది. ఆరోజునుంచే జానకమ్మ కలలు, ఊహలు కూలిపోవడం మొదలు పెట్టాయి. ఆ కోడలు సరోజినికి జానకమ్మంటే అసలు లక్ష్యం లేదు. తను చదువుకున్నదనే అహం ఆమెలో బాగా వున్నది. జానకమ్మ చెప్పినట్టు వినేది కాదు. తన ఇష్టంవచ్చినట్టు ప్రవర్తిస్తోంది.

జానకమ్మకు కోడలి ప్రవర్తన బాగానే బాధపెట్టింది. కోడలి ప్రవర్తన గురించి కొడుకుతో చెప్పింది జానకమ్మ. మొదటిసారి సదానందం భార్యతో తగూపడ్డాడు. కానీ అదే చివరిసారి కావాలనీ, ఇంకోసారి తనతో గొడవపడితే తను ఆ ఇల్లు వదిలి వెళ్లిపోతాననీ గట్టిగానే చెప్పింది సరోజిని.

ఆరోజునుంచీ సదానందం భార్యచాటు మనిషిగా మారిపోయాడు. జానకమ్మ మాటకు విలువలేకుండా పోయింది. ఆమె తనలో తనే కుమిలిపోతూ బతుకుతున్నది.

కోడలు జానకమ్మచేత ఇంటి పనులన్నీ చేయిస్తున్నది. కేవలం ఒక పనిమనిషిగా వాడుకుంటున్నది. అంతకు మించి జానకమ్మకు ఆ ఇంట్లో ఎటువంటి గౌరవమూ లేదు. మర్యాద లేదు.

ఎంత సరిపెట్టుకున్నా ఆరోజు మళ్లీ జానకమ్మకు చావు గురించి ఆలోచించవలసిన అవసరం యేర్పడింది.

ఆరోజు మధ్యాహ్నం బట్టలన్నీ వుతికి బయట తాడు మీద ఆరవేసింది జానకమ్మ.

తర్వాత ముందు గదిలోకి వచ్చి ఓ మూల పడుకొని నిద్రపోయింది.

సాయంత్రమయ్యేసరికి పెద్ద చినుకులతో వర్షం మొదలయ్యింది.

జానకమ్మకు మెలకువ వచ్చేసరికి తాడుమీద పూర్తిగా తడిసిపోయిన తన బట్టలు మాత్రం కనిపించాయి. కొడుకు బట్టలు, కోడలి బట్టలు కనిపించలేదు.

"నా బట్టలను కూడా తియ్యకూడదా?" అనడిగింది కోడల్ని.

"అద్దమయిన వాళ్ల బట్టలూ తియ్యాల్సిన గతి నాకేం పట్టింది?" అన్నది ఈసడింపుగా.

అంతటితో వూరుకోలేదు. జానకమ్మ తమ ప్రాణాలకు శనిలా దాపురించిందనీ, ఆ శని వదిలిపోవాలని తను రోజూ అనేకరకాల దేవుళ్ళకు పూజలుచేస్తున్నానని కూడా అన్నది.

ఆ మాటలు విన్న తరువాత జానకమ్మ హృదయం బాధతో విలవిల్లాడిపోయింది. గుండె మండింది. ఆమెలోని అణువణువునూ ఎవరో చిత్రవధ చేస్తున్నట్టు అనిపించింది. కోడలు ఆ మాటలు అనిన తర్వాత ఇక బతకాలనే ఆశ జానకమ్మ మదిలో పూర్తిగా నశించిపోయింది.

ఆ క్షణంలోనే జానకమ్మ తను ఆ రాత్రికి బావిలో దూకి చచ్చిపోవాలని అనుకున్నది.

వర్షంలోనే తడిసి ఇంటికి వచ్చాడు జానకమ్మ కొడుకు సదానందం. రాగానే అత్తగారు తనని బాగా తిట్టినట్టుగా మొగుడితో చెప్పింది సరోజిని. జానకమ్మ అన్నీ విన్నది. కానీ ఏమీ మాట్లాడదల్చుకోలేదు.

చీకటి పడింది.

వర్షం జోరు పెరిగిపోతూనే వున్నది.

ఆరాత్రి జానకమ్మ భోజనం చెయ్యలేదు. కానీ కొడుకుగానీ, కోడలు గానీ ఆమెను భోజనం చెయ్యమని అనలేదు.

వారి భోజనాలయిన తర్వాత గది తలుపులు బిగించుకొని పడుకున్నారు.

జానకమ్మ చాపమీద అసహనంగా కదిలింది. కడుపులో ఆకలి దహించుకుపోతోంది. ఆవేదనా భారంతో గుండె మండిపోతోంది.

మధ్య గదిలో గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

బయట వర్షం జోరు తగ్గలేదు.

చీకట్లోనే ఆమె కళ్ళు తెరుచుకుని చూస్తోంది.

ఇక తను ఆలస్యం చేయకూడదు. తను అందరికీ భారమయ్యింది. తను ఏ ఆశతో బతకాలి? ఎవరికోసం బతకాలి? తను చచ్చిపోవాలి. అవును. తప్పదు.

చాపమీద లేచి కూర్చుంది.

పైకి లేవబోయింది.

గిరుక్కున వెనక్కు చూసింది. ఆమె పమిటచెంగు మనవడి చేతిలో వుంది. వాడికి మెలకువ వచ్చినట్టుంది. చీకటిని చూసి భయపడి "బామ్మా... బయమే" అంటున్నాడు.

జానకమ్మ ఆలోచనలను పక్కకు నెట్టి మళ్లీ చాపమీద వాడి పక్కనే పడుకుని మనవడిని గట్టిగా గుండెకు అదుముకున్నది. మనవడి వొళ్లు తడిమింది. అంత చీకట్లోనూ మనవడు జానకమ్మకు ఆశాకిరణంలా అగుపించాడు. రేపు వాడు తనని ప్రేమగా చూసుకోడా? తను వాడికోసమయినా బతకాలి.

జానకమ్మ చావు మరోసారి వాయిదా పడింది.

(2-11-83 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితం)